క్లుప్తంగా

మౌలిక వసతుల కల్పనకు చర్యలు



పారిశ్రామికవాడలో చెత్త తొలగిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

హిందూపురం: పట్టణ పరిధిలోని పారిశ్రామిక వాడలో నెలకొన్న సమస్యలపై 'పారిశ్రామికాభివృద్ధి ఎక్కడ బాలయ్యా' అన్న శీర్షికన 'సాక్షి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఇందులో భాగంగానే శుక్రవారం పారిశ్రామికవాడలోని కాలనీల్లో చెత్తాచెదారాన్ని తొలగించారు. పడిపోయిన వీధిలైట్లు ఏర్పాట్లు చేయడానికి చర్యలు చేపట్టారు. మరో మూడు రోజులు స్పెషల్ డ్రైవ్ చేపట్టి అన్ని ప్రాంతాలను పరిశీలిస్తామని అధికారులు తెలిపారు. అలాగే రోడ్ల మరమ్మతుకు ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నామని పారిశ్రామికవాడ జోనల్ మేనేజర్ నాగకుమార్ పేర్కొన్నారు.

ఆలయ ప్రధాన అర్చకుడిగా మారన్న

రొళ్ల: మండల పరిధిలోని గంతికల్లు గొల్లహట్టిలో వెలసిన యాదవ కులస్తుల ఆరాధ్యదైవం యత్తప్పస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వందలాది మంది భక్తుల మధ్య ఆలయ నూతన ప్రధాన అర్చకుడిగా మారన్నకు సాంప్రదాయం ప్రకారం పట్టం (పట్టాభిషేకం) కట్టారు. ఆలయ నూతన ప్రధాన అర్చకుడిగా పట్టం కట్టుకున్న మారన్నకు పూలమాల వేసి శాస్త్రోక్తంగా సన్మానించారు.

రక్షణ కల్పించాలని విద్యార్థినుల నిరసన



నిరసన తెలియజేస్తున్న విద్యార్థినులు

హిందూపురం టౌన్: పట్టణంలోని స్థానిక పాలిటెక్నిక్ మహిళా కళాశాలలో విద్యార్థినులు రక్షణ కల్పించాలంటూ నిరసనకు దిగారు. శుక్రవారం కళాశాల వద్ద విద్యార్థినులు బైఠాయించి కళాశాల వార్డెన్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమకు రక్షణ కల్పించాలని, హాస్టల్లో నాణ్యమైన భోజనాన్ని అందించాలని, గోడలకు ఉన్న రంధ్రాలను పూడ్చి మరమ్మతు చేయించాలన్నారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బాబావలి వారికి మద్దతు పలికారు. అనంతరం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

మడకశిర: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. పలు అంశాల పై స్థానిక రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఎఫ్‌పీ షాపుల్లో ఉపయోగించే ఎలక్ట్రానిక్ తూకాల మిషన్లను పరిశీలించారు.

శునకానికి అంత్యక్రియలు



లేపాక్షి: మండల కేంద్రంలోని పిల్లిగుండ్ల కాలనీ వద్ద ఉన్న జాతీయ రహదారిపై లారీ ఢీకొనడంతో ఓ శునకం చనిపోయింది. అటుగా వెళ్తున్న విశ్రాంత ఏఎస్ఐ రామ్మూర్తి చనిపోయిన శునకాన్ని చూసి చలించిపోయారు. రోడ్డు పక్కనే గడ్డపారతో గుంతను తీసి శునకాన్ని పూడ్చిపెట్టారు. స్థానికులు, వాహనదారులు ఆయన్ను అభినందించారు.

లేఅవుట్ రాళ్ల తొలగింపు

పెనుకొండ: పట్టణంలోని సర్వేనంబర్ 698లో అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్ రాళ్లను శుక్రవారం తొలగించినట్లు కమిషనర్ సతీష్‌కుమార్ తెలిపారు. నగర పంచాయతీ పరిధిలో కొందరు వ్యక్తులు ఇష్టారాజ్యంగా ప్లాట్లు వేసుకుని విక్రయాలు జరుపుతున్నారని, నగర పంచాయతీ పరిధిలో అహుడా నిబంధనలకు లోబడి ఉంటేనే అనుమతిస్తామన్నారు. ఈ నేపథ్యంలో లేఅవుట్ రాళ్లను తొలగించినట్లు కమిషనర్ తెలిపారు.

శుభకార్యం



కాబోయే వధూవరులను ఆశీర్వదిస్తున్న ఉషశ్రీ చరణ్, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తదితరులు

పెనుకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర కుమార్తె నిశ్చితార్థం వేడుకను గుట్టూరు గ్రామంలోని జీపీఎస్ కల్యాణ మండపంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ హాజరై కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించారు.

కంట్రోలర్ లేక ఇబ్బందులు



లేపాక్షి ఆర్టీసీ బస్టాండు

లేపాక్షి: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండులో కంట్రోలర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ బస్టాండుకు బస్సులు రాకపోకలు బాగా జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారి లేకపోవడంతో బస్టాండుకు వచ్చే ప్రయాణికులకు సమాచారం తెలియక నానా అవస్థలు పడుతున్నారు. బస్సులు ఏ సమయానికి వస్తాయి? ఏ సమయానికి వెళ్తాయి తదితర వివరాలను చెప్పేవారు లేక ప్రయాణికులు, పర్యాటకులు ప్రైవేటు బస్సులు, ఆటోలను ఆశ్రయిస్తున్నారు. బస్టాండులో విధులు నిర్వర్తించడానికి గతంలో హిందూపురం డిపో నుండి సిబ్బందిని నియమించారు. కంట్రోలర్ పదవి విరమణ తర్వాత అనంతరం ఒక్కరిని కూడా నియమించలేదు. ఆర్టీసీ సిబ్బంది, కంట్రోలర్ లేకపోవడంతో బస్టాండు పశువులకు పాకగా, ఆకతాయిలకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

ముళ్ల 'దారి'

పెనుకొండ: మండలంలోని అడదాకులపల్లి నుంచి సోమందేపల్లి వైపు వచ్చే రహదారి ముళ్ల కంపలతో నిండిపోయింది. అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో రోడ్డుకు ఇరువైపులా ముళ్ల చెట్లు ఏపుగా పెరిగిపోయి వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాక్టర్లు, లారీలు ఈ రోడ్డు గుండా వెళితే ముళ్ల కంపలు తగులుతూ ప్రయాణానికి అసౌకర్యం కలుగుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. పొలాల నుంచి పశుగ్రాసం, ధాన్యం తీసుకురావాలంటే ఇబ్బందిగా ఉందని చెబుతున్నారు. ఇక రాత్రి వేళల్లో ఈ దారి గుండా వెళ్లాలంటే భయంగా ఉంటుందని పేర్కొంటున్నారు. ముళ్ల కంపలను తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుకు ఇరు వైపులా ముళ్ల కంపలతో నిండిన అడదాకులపల్లి రోడ్డు

పొంచి ఉన్న ప్రమాదం



తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

అమరాపురం: స్థానిక దిగువ ఇందిరమ్మ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. చేతికందే ఎత్తులో ఉండటంతో ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీని పక్కనే అంగన్‌వాడీ కేంద్రం ఉండటంతో చిన్నారుల తల్లిదండ్రులు, సిబ్బంది భయం భయంగా గడుపుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ వివిధ రకాల ఆకుల తీగలు అల్లుకుని ఎక్కడ విద్యుత్ సరాఫరా అవుతుందో తెలీడం లేదని, వెంటనే సంబంధిత అధికారులు స్పందించి టాన్స్‌ఫార్మర్ చుట్టు పక్కన శుభ్రం చేసి కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడండి



పెనుకొండ: డీటీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు, విలేకరులు



మడకశిర: ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

చిలమత్తూరు: జర్నలిస్టుల జోలికొస్తే సహించబోమని వైఎస్సార్‌సీపీ నేతలు, జరలిస్టుల సంఘాల నాయకులు మండిపడ్డారు. అక్రమాలను వెలుగులోకి తెస్తున్న 'సాక్షి' జర్నలిస్టులపై కేసులు పెట్టడం హేయమన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో నియోజకవర్గ జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ, వామపక్ష నాయకులు జర్నలిస్టులకు మద్దతు తెలిపారు. జర్నలిస్టులతో కలిసి కూటమి ప్రభుత్వ తీరును ఎండగట్టాయి. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, ఆంజినేయులు, నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గస్థాయి నాయకుడు వేణురెడ్డి, మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీలు ఆదినారాయణ, రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: పత్రికా స్వేచ్ఛను కాపాడాలంటూ దళిత సంఘాల నాయకులు, జర్నలిస్టులు ఆర్డీఓ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఎం.ఎస్ మూర్తి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రామాంజినేయులు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వాలకు వారధిగా నిలిచే జర్నలిస్టులపై అధికారులు జులుం ప్రదర్శించడం సరికాదన్నారు. పత్రికా స్వేచ్ఛను కాలరాయడం హేయమన్నారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డితో పాటు విలేకరులపై పెట్టిన కేసులు కొట్టివేయాలని డిమాండ్ చేశారు.

మడకశిర: మడకశిరలో శుక్రవారం 'సాక్షి' పత్రిక పై కూటమి ప్రభుత్వం, పోలీసుల వేధింపులను నిరసిస్తూ జర్నలిస్టులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం మడకశిర తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందించి న్యాయం చేయాలని కోరారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

- కోటి సంతకాల సేకరణలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

పరిగి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణతో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. మండలంలోని పీ నరసాపురంలో శుక్రవారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత వైఎస్సార్‌సీపీ హయాంలో గతంలో ఎన్నడూ లేని విధంగా నిరుపేదలకు, పేద విద్యార్థులకు వైద్యం, వైద్య విద్యను చేరువ చేయాలన్న లక్ష్యంతో 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి చర్యలు చేపట్టారన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ కొన్ని మెడికల్ కాలేజీల నిర్మాణాలను పూర్తి చేశారని చెప్పారు. దీన్ని జీర్ణించుకోలేని ప్రస్తుత కూటమి సర్కార్ పెద్దలు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని విమర్శించారు. జగనన్నకు ప్రజల్లో ఉన్న ఆదరణను ఓర్వలేకనే చంద్రబాబు ప్రభుత్వం జగనన్నపై కక్షగట్టిందన్నారు. ఇందులో భాగంగానే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు చర్యలు చేపట్టి పెత్తందార్లకు కాలేజీలను ధారాదత్తం చేస్తోందన్నారు. దీన్ని అడ్డుకునేందుకు వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపుమేరకు కోటి సంతకాల కార్యక్రమాన్ని చేపట్టి గవర్నర్‌కు అందజేయాలని వైఎస్ జగన్ పార్టీ శ్రేణులను ఆదేశించారన్నారు. అక్టోబర్ 28న నియోజకవర్గస్థాయి, నవంబర్ 12న జిల్లా కేంద్రంలో ర్యాలీ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

సవిత చేతకాని మంత్రిగా నిలిచిపోతారు

పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న మంత్రి సవిత ఇప్పటికైనా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంలో పాల్గొని ప్రైవేట్ పరం కాకుండా ఆపాలని ఉషశ్రీచరణ్ కోరారు. ఓట్లేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజాభిష్టాన్ని పట్టించుకోకుండా స్వార్థపూరిత ప్రయోజనాలకు తలొగ్గితే ప్రజలే బుద్ధిచెబుతారన్నారు. చేతగాని మంత్రిగా పెనుకొండ చరిత్రలో నిలిచిపోవడమే కాకుండా ప్రజలు ఆమెకు రాజకీయ సమాధి కడతారని హెచ్చరించారు. నియోజకవర్గానికి మంత్రిగా సవిత చేసిందేమీ లేకపోగా రాంపురానికి లిక్కర్ షాపు తెచ్చుకున్న ఘనత మంత్రి సవితకే దక్కిందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహమూర్తి, సర్పంచ్ సరస్వతి, నాయకుడు రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీ ఎంపిక

పీ నరసాపురం పంచాయతీ గ్రామ కమిటీని ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా రామచంద్ర, ఉపాధ్యక్షుడిగా నరేంద్ర, రామాంజినప్ప, జనరల్ సెక్రటరీగా వెంకటేష్, కార్యదర్శులుగా అంజనప్ప, రామకృష్ణప్ప, యువజన విభాగానికి ఎస్ అంజినప్ప, రైతు విభాగానికి రామప్ప, మహిళా విభాగానికి జయమ్మ, బీసీ సెల్ విభాగానికి అనిల్, ఎస్సీ సెల్ విభాగానికి నాగప్ప, ఐటీ విభాగానికి లక్ష్మీకాంత్, ప్రచార విభాగానికి శివ, పంచాయతీరాజ్‌కు సోమశేఖర్, సోషల్ మీడియాకు నవీన్, బూత్ కమిటీకి శ్రీనివాసరెడ్డి, బాలాజీ, శ్రీనివాసులు, వాలంటరీ విభాగానికి పవన్‌కళ్యాణ్, గీవెన్స్‌కు అశ్వర్థప్ప అధ్యక్షులుగా ఎంపిక చేశారు.

కౌన్సిలర్లకు కనీస గౌరవం ఇవ్వండి



మాట్లాడుతున్న చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్

పెనుకొండ: కౌన్సిలర్లకు కనీస గౌరవం ఇవ్వాలని నగర పంచాయతీ కౌన్సిలర్లు రఘునాథరెడ్డి, రామాంజినేయులు పేర్కొన్నారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ ఉమర్ ఫారూక్‌ఖాన్ శుక్రవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కౌన్సిలర్లు రఘునాథరెడ్డి, రామాంజినేయులు మాట్లాడుతూ ప్రజల మద్దతు గెలిచిన కౌన్సిలర్లకు కనీస గౌరవం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. కనీసం వీధి లైట్లు వేసినా, ప్రజా కార్యక్రమాలు జరిగినా కౌన్సిలర్లకు తెలపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా పట్టణంలోని ఈద్గా నుంచి మురుగు నీరు తారు రోడ్డు పైకి వస్తోందని, ఏ ఒక్కరూ దీని గురించి పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే డ్రైనేజ్ నిర్మాణం చేపట్టాలన్నారు. పట్టణంలో కుక్కల నియంత్రణకు తగిన చర్యలు చేపడుతామని నగర పంచాయితీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలో 20 మంది కౌన్సిలర్లు ఉండగా 12 మంది కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరయ్యారు. 8 మంది సభ్యులతో కోరం ఉండడంతో సమావేశం ముగించారు. కాగా తమకు ఏ మాత్రం విలువ ఇవ్వకపోవడంతో పాటు తమకు తెలీకుండా అభివృద్ధి పనులు చేస్తున్నారని సమావేశాన్ని బహిష్కరించినట్లు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు తెలిపారు. కమిషనర్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ 42 పనులకు గానూ రూ. 2.64 కోట్లకు పైగా నిధులతో పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ వైస్ చైర్మన్ సునీల్, కమిషనర్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి ఏఐఎస్ఎఫ్ బస్సు జాతా



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

హిందూపురం టౌన్: రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఇచ్చాపురం నుంచి హిందూపురం వరకూ 22వ తేదీ నుంచి నవంబర్ 12వ తేదీ వరకూ జరుగుతున్న బస్సు జాతాను జయప్రదం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు షబ్బీర్ భాష పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో స్థానిక ఏపీ ఎన్జీవో హోమ్ లో బస్సు జాతా పోస్టర్లను విడుదల చేశారు. షబ్బీర్ భాషతో పాటు ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యులు వేమయ్య యాదవ్ మాట్లాడుతూ మెడికల్ కళాశాలలో పీపీపీ విధానాన్ని కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చిలమత్తూరు: ఆటోడ్రైవర్ నిర్లక్ష్యంతో టేకులోడుకు చెందిన సజ్జప్ప అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. ఆటోలో ఇంటి పైకప్పు కోసం వేసే ఐరన్ పలకలు వేసుకొని టేకులోడు వైపుకు వెళుతుండగా అతి వేగం కారణంగా ఆటోలోని ఐరన్ పలకలు కిందకు పడిపోవడం ఆ సమయంలో బైక్‌లో వెళుతున్న సజ్జప్పపై అవి పడటంతో ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన అతన్ని ఆస్పత్రికి తరలించారు.

ఎస్‌జీఎఫ్ పోటీలు ప్రారంభం

పరిగి: క్రీడలు శారీరక ధృఢత్వాన్ని పెంపొందించడంతో పాటూ మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం తెలిపారు. మండల కేంద్రం పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన పోటీలలో మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లేపాక్షి: మండలంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ సిరివరం ఫీడర్ లైన్‌లో మరమ్మతు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటేశులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మండలంలోని సిరివరం, కోడిపల్లి, తిరుమలదేవరపల్లి, గోపిందేవరపల్లి, గౌరిగానపల్లి, మానేపల్లి, నాగేపల్లి, నాగానపల్లి ప్రజలు సహకరించాలని కోరారు.

డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక



రొళ్ల: డివిజన్ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు

రొళ్ల: మండల పరిధిలోని దొమ్మరహట్టి సమీపంలోని 544ఈ జాతీయ రహదారి పక్కన ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల క్రీడా మైదానంలో వాలీబాల్ అండర్-17 విభాగంలో బాల, బాలికలకు మండలస్థాయి పోటీలు నిర్వహించినట్లు మండల కోఆర్డినేటర్ మోహన్ తెలిపారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులు ఈనెల 21న నిర్వహించనున్న డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని కల్లుమర్రి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ మండల స్థాయి ఎంపికకు బాల,బాలికలకు అండర్-17 వాలీబాల్ పోటీలను నిర్వహించారు. బాలుర విభాగంలో గుండుమల గురుకుల బాలుర పాఠశాల జట్టు, బాలికల విభాగంలో రేకులకుంట ఉన్నత పాఠశాల జట్టు విజయం సాధించి డివిజన్ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ఇన్‌చార్జ్ హెచ్ఎం నాగేంద్ర, పీడీ ప్రకాష్‌రెడ్డి తెలిపారు.

జనవరి నుంచి పావగడకు రైలు

- కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్న



మాట్లాడుతున్న కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్న

పావగడ: తాలూకాలోని కే.రాంపురం గ్రామం వద్ద నిర్మిస్తున్న రైల్వేస్టేషన్ పనులను కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న శుక్రవారం పరిశీలించారు. డిసెంబర్ 25న నిర్వహించే ఏబీ వాజపేయి జయంతిని పురస్కరించుకుని దొడ్డహళ్లి పేరుతో ఉన్న రైల్వేస్టేషన్‌ను కే రాంపురం రైల్వేస్టేషన్‌గా నామకరణం చేస్తామన్నారు. గత 11 సంవత్సరాలలో 13,200 రైల్వే గేట్లను తెరిచామన్నారు. 2026 జనవరికి రాయదుర్గం నుంచి పావగడకు రైలు నడుపుతామన్నారు. 2027కు తుమకూరు-రాయదుర్గం రైల్వే పనులు పూర్తి చేస్తామన్నారు. తుమకూరు-రాయదుర్గం రైల్వే యోజనకు డబుల్ లైన్ ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే తుమకూరు-బళ్లారి జాతీయ రహదారి నిర్మాణం సుమారు రూ. 6 వేల కోట్లతో నిర్మిస్తామన్నారు. ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్, మాజీ మంత్రి వెంకటరమణప్ప, హిందూపురం ఎంపీ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఇప్పించండి

మడకశిరరూరల్: మడకశిర మీదగా పావగడకు వెళ్తున్న కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్నను శుక్రవారం మండలంలోని ఏఆర్ రొప్పం క్రాస్ వద్ద ఆమిదాలగొంది సర్పంచ్ గీతతో పాటు నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. కర్ణాటక రాష్ట్రం తుమకూరు నుంచి పావగడ మీదుగా రాయదుర్గం వరకూ రైల్వేలైన్ నిర్మాణానికి మడకశిర -పావగడ సరిహద్దు ప్రాంతంలో భూములు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. భూములు కోల్పోయిన బాధితుల భూముల వివరాలు తీసుకోస్తే న్యాయం చేస్తామని కేంద్ర సహాయ మంత్రి హామీ ఇచ్చారు.

మంత్రికి వినతి

మడకశిర: రైల్వేలైన్ నిర్మాణం కోసం ఇళ్లు పోగొట్టుకున్న బాధితులు కేంద్ర మంత్రి సోమన్నకు శుక్రవారం తమ గోడు చెప్పుకున్నారు. శుక్రవారం రైల్వే లైన్ నిర్మాణ పనులను హిందుపురం రోడ్డు మైనార్టీ కాలనీ వద్ద మంత్రి పరిశీలిస్తుండగా మైనార్టీ కాలనీకి చెందిన మహిళలు మంత్రి ఎదుట తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఫోన్ మాట్లాడుకుంటూ మంత్రి వెళ్లిపోయారేగాని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

హిందూపురం: క్రీడలతోనే మానసిక ఉల్లాసంతో పాటు పోటీతత్వం అలవడుతుందని వన్‌టౌన్ సీఐ రాజగోపాల్ అన్నారు. శుక్రవారం స్థానిక సప్తగిరి కళాశాలలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మేరా యువభారత్ ఆదర్శ యూత్ అసోసియేషన్ సంయుక్తంగా క్లస్టర్ ఆఫ్ బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. అనంతరం వాలీబాల్, కబడ్డీ, పరుగు పందెం పోటీలు నిర్వహించి విజేతలకు మెమొంటో, సర్టిఫికెట్లు అందించారు.

ఘనంగా గ్యార్మీ పండగ



దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

అమరాపురం: మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం గ్యార్మీ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఇందిరమ్మకాలనీలో ఉన్న దర్గా వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జెండాను ఆవిష్కరించారు. అనంతరం అక్కడి నుంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దర్గాలో మహబూస్నీసా పేరిట ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ప్రతి ఏడాదిలాగే శుక్రవారం రాత్రి విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు.

శ్రీకృష్ణదేవరాయలుకు ఘన నివాళి



గోరంట్ల: శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు

లేపాక్షి: దక్షిణ భారత దేశ మహా చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల జయంతి, పట్టాభిషేక దినోత్సవం, వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని హిందూపురం బలిజ సేవా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీకృష్ణదేవరాయల వర్ధంతి సందర్భంగా పట్టణంలోని రాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

గోరంట్ల: బలిజ సంఘం మండలశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గోరంట్లలో శ్రీకృష్ణదేవరాయల వర్ధంతిని నిర్వహించారు. కృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సోమందేపల్లి: మండలంలోని గుడిపల్లిలో శ్రీకృష్ణదేవరాయల వర్ధంతిని బలిజ సంఘం నాయకులు నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ సంఘం నాయకులు అశ్వర్థ, రమణప్ప, నవీన్, లక్ష్మీనారాయణ, గంగప్ప, ముద్దప్ప, సునిత తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోండి

పరిగి: విద్యార్థులతో పాటు యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సేవామందిరం ఏఎం లింగణ్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో వికసిత భారత్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆచార్య అజిత్, బిట్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రతిభ కనపరిచిన వారికి వికసిత్ భారత్ సర్టిఫికెట్లను అందించారు.

రేపు ఉచిత ఆరోగ్య శిబిరం

అమరాపురం: స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఉదయం పది గంటల నుంచి ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆరోగ్యమైత్రి కూటమి సభ్యులు డాక్టర్ బసవరాజు, పద్మరాజ్‌జైన్, శ్రీనివాసమూర్తి తెలిపారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కేబుల్ అపహరణ

అగళి: మండల పరిధిలోని ఇరిగేపల్లి హైవే రోడ్డుపై సమీపంలోని ప్రభుత్వ తాగునీటికి బోరుకు సంబంధించిన 20 మీటర్లు కేబుల్‌ను గురువారం రాత్రి దొంగలు అపహరించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు సర్పంచ్ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మహేష్ తెలిపారు.